క్లుప్తంగా

రేపు చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో గురువారం వాసవీ దీక్షా బృందం ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం చండీహోమాన్ని నిర్వహించనున్నట్లు గురువాసవీ అలవల మహేష్ తెలిపారు. మంగళవారం అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుష్యమాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆర్యవైశ్య సభ సహకారంతో గణపతి, నవగ్రహ, చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య చిన్నారులకు కన్యక పూజ చేస్తున్నామన్నారు.

జాబ్‌మేళాలో 34 మంది ఎంపిక

మైదుకూరు : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 34 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో జరిగిన జాబ్‌మేళాలో అతిథిగా పాల్గొన్న కరస్పాండెంటు ఓబుళరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం, మూడవ మంగళవారం రోజుల్లో జిల్లా ఏదో ఒక నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తారన్నారు. జాబ్‌మేళాకు 96 మంది హాజరు కాగా ముత్తూట్ ఫైనాన్స్, నవత ట్రాన్స్‌పోర్టు, ఎయిల్ డిక్షన్ కంపెనీలు 34 మందిని ఎంపిక చేసుకున్నాయి. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

చాపాడు : మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరుకానున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖ అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి హుండీ ఆదాయ లెక్కింపు జరిగింది. మూడు నెలలకు గాను భక్తులు రూ.3,29,700, గోశాలకు రూ.20,559 కానుకల రూపంలో సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ అకౌంట్లో జమ చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయశాఖ ఏసీ శంకర బాలాజి తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్, అర్చకులు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు. కాగా ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య హోమంలో పాల్గొన్నారు.

తైక్వాండోలో క్రీడాకారిణి సత్తా



భవ్య

పోరుమామిళ్ల : రాజస్థాన్ స్టేట్ సవాయి మాదాపూర్‌లో ఈనెల 19, 20, 21 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్లకు చెందిన సంగా భవ్య రజత పతకం సాధించినట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. సీనియర్ అండర్ 73 విభాగంలో భవ్య ఈ పతకం సాధించిందన్నారు. పోటీల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ జట్టుకు మాస్టర్ నాయబ్ రసూల్ కోచ్‌గా వ్యవహరించారు.

నేడు ర్యాలీ

ప్రొద్దుటూరు కల్చరల్ : నవసమాజ నిర్మాణం కోసం జీవన జ్యోతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ అమర్‌నాథరెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలో వెళుతోందని, సెల్ ఫోన్‌ను అవసరానికి మించి వాడటం, మద్యం, జూదం అలవాటు చేసుకుని భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు, యువతను చైతన్య వంతులు చేసేందుకు ఈ ర్యాలీ చేపడుతున్నామన్నారు.

స్థాయి మరచి మాట్లాడటం తగదు



మాట్లాడుతున్న ఖాజా

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తన స్థాయిని మరచి మాట్లాడుతున్న తీరు, ముస్లీం మైనార్టీల పట్ల చేస్తున్న వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తిప్పిరెడ్డిపల్లె దస్తగిరిరెడ్డిపై వాస్తవంగా కిడ్నాప్ చేసిన ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేస్తే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి స్టేషన్‌కు వెళ్లి హంగామా చేయటం రౌడీని తలపిస్తోందన్నారు. 2016లో ఐపీ దాఖలు చేసిన మహబూబ్ బాషాపై డబ్బు బాకీ విషయంపై చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన దస్తగిరి, ఆయన కుమారుడిపై బాధితుల ఫిర్యాదు మేరకూ కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు విచారించేందుకు పోలీసులు స్టేషన్‌కు పిలిపిస్తే స్టేషన్‌లో మహబూబ్ బాషా సోదరులపై దస్తగిరి, ఆయన కుమారుడు దాడి చేసిన ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయిందన్నారు. దౌర్జన్యంగా వ్యవహరిస్తున్న దస్తగిరి టీడీపీ నాయకుడు అని, అన్యాయం జరిగిందని వెనకేసుకురావడం సరైన చర్య కాదని ప్రశ్నించారు. రాజకీయాలలో హుందాగా ఉండాల్సిన ప్రవీణ్ మైనార్టీల గురించి అసభ్యకరంగా మాట్లాడడం తగదన్నారు.

అక్కాచెల్లెళ్ల ఆనందమే జగనన్న ధ్యేయం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ప్రొద్దుటూరులో డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు : అక్కా చెల్లెమ్మల మోములో ఆనందం చూడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని డ్వాక్రా మహిళలకు రూ.19.40కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను దాదాపుగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. డ్వాక్రా మహిళల రుణ మాఫీ చేస్తానని నాడు మాట ఇచ్చిన జగన్ నేడు నాలుగో విడత మాఫీ చేసి మాట నిలుపుకున్నారన్నారు. ఇతర పార్టీ నాయకుల మాదిరి మాట ఇచ్చి ఎన్నికల సమయంలో కాకుండా ప్రతి ఏటా ఆ హామీని నెరవేర్చి ప్రజల మోములో ఆనందం చూస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25లక్షలకు పెంచి మన ఆరోగ్యానికి భద్రత కల్పించారన్నారు. ఏపీ, తెలంగాణా, చెన్నై, బెంగుళూరు నగరాలతో పాటు మొత్తం 252 కార్పొరేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకోవచ్చన్నారు. నియోజకవర్గ పరిధిలో 54వేల మంది డ్వాక్రా మహిళలకు రుణమాఫీ జరిగిందన్నారు. రూ.53 కోట్లతో పెన్నానదిపై వంతెన, రూ.5కోట్లతో బస్టాండ్, రూ.4కోట్లతో పార్కుల నిర్మాణం, రూ.50 కోట్లతో మార్కెట్ నిర్మాణం, రూ.65 కోట్లతో వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం, రూ.24 కోట్లతో ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారమే దశల వారీగా పింఛన్‌ను రూ.3వేల పెంచడం జరిగిందన్నారు. మీ బిడ్డల బంగారు భవిష్యత్తుకు ఏ ప్రభుత్వం పాటుపడిందో ఆలోచించుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పీసీఏ మెంబర్ నాగేశారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, పీఈ కెజియా జాస్లీన్, సీఓలు, ఆర్‌పీలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షల వల్ల పోటీతత్వం అలవడుతుంది



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపవిద్యాశాఖాధికారి తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రతిభా పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని ఉపవిద్యాశాఖాధికారి జి.క్రిష్టప్ప పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణాలయంలోని మండపంలో నేతాజి సోషల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాంఘీక శాస్త్రంలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు శోభారాణి, చిట్టిబాబు, క్రిష్టఫర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో చైతన్యం కలిగించడానికి ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్షుడు నాగారాజారావు మాట్లాడుతూ ఈ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు, సర్టిఫికెట్‌లను అందచేశారు. ప్రథమ బహుమతి తెలుగు మీడియంలో సుమిత్ర (మాచనపల్లి జెడ్పీహెచ్ఎస్) ద్వితీయ బహుమతి జగన్ (నల్లలింగాయపల్లె జెడ్పీహెచ్ఎస్), తృతీయ బహుమతి షాలేమురాజు (లెక్కలవారిపల్లె జెడ్పీహెచ్ఎస్), నాలుగవ బహుమతి చంద్రిక (దొరసానిపల్లె జెడ్పీహెచ్ఎస్), ఇంగ్లీషు మీడియంలో ప్రథమ బహుమతి అంజుం అఫీసా (ఉప్పలూరు జెడ్పీహెచ్ఎస్), ద్వితీయ బహుమతి ప్రణవ్‌నాథ్ (వేపరాల జెడ్పీహెచ్ఎస్), శివపూజిత (జమ్మలమడుగు జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్), తృతీయ బహుమతి చరణ్ తేజ (ప్రొద్దుటూరు ఏబీఎమ్‌హెచ్), మమత(జమ్మలమడుగు జెడ్పీహెచ్ఎస్ గరల్స్) విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో క్లబ్ కన్వీనర్ భాస్కరరావు, ఉపాధ్యాయులు పద్మనాభరాజు, సుబ్రహ్మణ్యం, కృష్ణమోహన్, గురుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇనాంభూముల పట్టాలు పంపిణీ

దువ్వూరు : మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం 3.30గంటలకు ఇనాం భూములకు పట్టాలను పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయటం జరుగుతుందని ఎంపీపీ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

పోరుమామిళ్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సగిలేరు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎఫ్ రాష్ట్ర నాయకులు భాస్కరరావు, సుబ్బయ్య, జిల్లా నాయకులు కృష్ణనాయక్‌లు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు యాజమాన్యం పరిష్కరించలేదన్నారు. ఈనెల 26 వరకు పాఠశాల స్థాయిలో, 27న కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేస్తున్నట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పోరుమామిళ్ల : దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. మంగళవారం టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. అనంతరం టేకూరుపేట సర్పంచ్ కల్లూరు రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతోపాటు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

రేపు అభివృద్ధి పనులు ప్రారంభం

చాపాడు : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి గురువారం ప్రారంభించనున్నట్లు మండల అధ్యక్షులు లక్షుమయ్య తెలిపారు. ఉదయం 9 గంటలకు ఖాదర్‌పల్లెలో విలేజ్ క్లీనిక్ భవనం ప్రారంభం, 9.30కు సీతారామాపురంలో కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ, 10 గంటలకు చిన్నగురువళూరులో రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్ భవనాలు, 10.30గంటలకు బద్రిపల్లెలో రైతు భరోసా కేంద్రం, 11గంటలకు సోమాపురంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్ భవనాలను ప్రారంభిస్తారన్నారు.

కెరీర్ గైడెన్స్ పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్: విలువైన సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్‌కు బాట వేసుకోవాలని వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక 2వ వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను మంగళవారం అందచేశారు. ప్రధానోపాధ్యాయురాలు గీత, సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వెంకటసురేష్ తదితరులు పాల్గొన్నారు.

మన చేతుల్లోనే రోడ్డు ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఆర్టీఓ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణ మన చేతుల్లోనే ఉందని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. మండల పరిధిలోని వాగ్దేవీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదన్నారు. 18 ఏళ్లు నిండిన యువకులు తప్పకుండా లైసెన్స్ పొందాలని సూచించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే అధికంగా యువకులే ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. ఇది చాలా ఆందోళన పడాల్సిన విషయమని చెప్పారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి బైక్‌లను నడపాలని ఆర్టీఓ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి సిద్దేశ్వరరావు, సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్, డాక్టర్ వరుణ్‌కుమార్, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ శేఖర్‌రావు

బద్వేలు అర్బన్ : విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, అర్బన్ సీఐ పి.యుగంధర్‌లు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఎస్ఆర్ఎస్‌టీ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ – తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ వాహనాలను పరిమిత వేగంతో నడపడంతోపాటు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను వమ్ము చేయకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్



బద్వేలు అర్బన్: నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

బద్వేలు అర్బన్ : దేశం పట్ల అపారమైన భక్తితో పాటు సంకల్పశక్తి ఉన్న పోరాటయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి పేర్కొన్నారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 127వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి యువతను స్వతంత్ర సంగ్రామం వైపు నడిపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తొలుత నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక సుమిత్రానగర్‌లోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో సుభాష్‌చంద్రబోస్ పాత్ర ఘనసీయమైనదని, ఆయన పోరాటపటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, పట్టణ నాయకులు రమణారెడ్డి, ఇమ్మానుయేల్, బాలగురయ్య, నరసింహులు, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీపై అంగన్‌వాడీల హర్షం



కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

మైదుకూరు : తమ డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం పలు హామీలు ఇవ్వటం పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆందోళన విరమించి విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు జీతాలు పెంచడంపై మూడు రోజుల్లో జీఓ ఇస్తామని చెప్పడంపై హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ బీమా వర్తింపు, మరణించిన వారి దహన సంస్కారాలకు రూ.20వేలు చెల్లింపు, సంక్షేమ పథకాల వర్తింపు, ప్రమోషన్ వయస్సు 50 ఏళ్లకు, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచడంపై వారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తమ ఆందోళనకు మద్దతు ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు చెన్నమ్మ, భారతి, ధనలక్ష్మీ, లక్ష్మీదేవి, రిజ్వానా, లక్ష్మీదేవి, రాధా, శోభ, శ్రీరాములు, షరీఫ్, పీరయ్య, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె సఫలం

పోరుమామిళ్ల : అంగన్‌వాడీలు 42 రోజులు చేసిన సమ్మె సఫలమైందని మంగళవారం అంబేడ్కర్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై స్పందించి ప్రభుత్వం న్యాయం చేసిందని, కృతజ్ఞతలు తెలిపారు.

హ్యాండ్ వాష్ స్టేషన్ ప్రారంభం

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇక్కడ చేతులు శుభ్రం చేసుకుని లోనికి వెళ్లాలని సూచించారు. యునిసెఫ్ ఆధ్వర్యంలో హ్యాండ్‌వాష్‌ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటరమణయ్య, మెప్మా ఎంఈ కెజియా జాస్లీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బహుభాషాకోవిధులు వావిలికొలను, రాళ్లపల్లి

గోపవరం : బహుభాషాకోవిధులైన వావిలికొలను సుబ్బారావు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ నేటి తరానికి ఎంతో ఆదర్శమూర్తులని సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, జి.వి.మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. వావిలికొలను, రాళ్లపల్లి జయంతి సభను మండలంలోని మొల్ల మందిరంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తా

– ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మీనాపురం రోడ్డులో ఉన్న ఖాదర్‌బాద్ చర్చి వద్ద భూ నిర్వాసితులతో ఎమ్మెల్యే మంగళవారం సమావేశం నిర్వహించారు. వేంపల్లె–చాగలమర్రి జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా ప్రొద్దుటూరు మండలంలోని నంగనూరుపల్లె, మీనాపురం గ్రామాల్లో భూ సేకరణ చేసేందుకు రైతులు, ప్లాట్ల యజమానులతో నాలుగు రోజుల క్రితం ఆర్డీఓ శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. 1 సెంటుకు రూ. 2.26 లక్షలు ప్రభుత్వం నష్టపరిహారంగా ఇస్తుందని ఆర్డీఓ తెలిపారు. అయితే ఇక్కడ సెంటు ధర సుమారు రూ. 5 లక్షల నుంచి రూ .10 లక్షల వరకు ఉందని ఆయా యజమానులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇటీవలే ప్లాట్లు కొనుగోలు చేశామని, ప్రభుత్వం మాత్రం చాలా తక్కువగా ఇస్తోందని సుమారు 300 ప్లాట్ల యజమానులు ఎమ్మెల్యే తో మొర పెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే రాచమల్లు వారితో సమావేశం అయ్యారు. కలెక్టర్‌తో మాట్లాడి నష్టపరిహారం పెంచేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నీలాపురం సుబ్బారెడ్డి, లారీ ట్రాన్స్‌పోర్టు యజమాని సుబ్రమణ్యం, జిలానిబాషా, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష



ప్రొద్దుటూరు తహసీల్దారు కార్యాలయంలో పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

ప్రొద్దుటూరు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన జగనన్న శాశ్వత స్థల హక్కు పథకంపై మంగళవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సమీక్ష జరిపారు. మండలంలో ఎంత మందికి ఇళ్ల పట్టాల మంజూరు చేశారు, వారికి ఏ విధంగా శాశ్వత స్థల హక్కు కల్పించాలనే విషయంపై తహసీల్దారు నజీర్ అహమ్మద్‌తో చర్చించారు. అనంతరం ఆన్‌లైన్‌లో పరిశీలించారు. రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు మనోహర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు జమ

కాశినాయన : మండలంలోని 504 డ్వాక్రా సంఘాల్లోని 4867 మంది డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.3.36 కోట్లు వైఎస్సార్ ఆసరా నగదు డ్వాక్రా సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు ఏపీఎం వీరాంజనేయులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిధులను మంగళవారం విడుదల చేశారని, నాలుగైదు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఈ నెల 30న నరసాపురం స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.